ప్రజాశక్తి

ఆదివారం 14 మే 2023 5

పార్వతీపురం మన్యం

19న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పదో తరగతి నుండి యుజి, పిజి కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి 18 నుండి 30 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువతకు ఈనెల 19న సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు 12 కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. కావున ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ వివరాలను ఎపి ఎన్ ఎసిసి వెబ్సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఒరిజినల్, జెరాక్స్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా జరుగు ప్రదేశంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. వివరాలకు 7032060773, 6305110947ను సంప్రదించాలన్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మస్తర్ల మాయాజాలం

- కూలీల కష్టాన్ని కాజేస్తున్న సిబ్బంది, అధికారులు
- పేపర్లపై వేస్తున్న హాజరుకు, డిజిటల్ మస్తర్లకు తేడా
- కాసులు ఇస్తేనే కనీస కూలి
- ప్రశ్నించిన వేతనదారులపై వేధింపులు

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీల కష్టాన్ని ఉపాధి సిబ్బంది కాజేస్తున్నారు. ప్రతి వారం ఒక్కో కూలీ రూ.100 చెల్లిస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం దక్కుతుందని, లేని పక్షంలో ఆరు రోజుల పనికి గానూ కూలి డబ్బులు రూ.500 నుంచి రూ.600 మాత్రమే చెల్లిస్తున్నారని కూలీలు ఆవేదన చెందుతున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో వంద రూపాయలు ముట్టజెప్పాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇదేమని ప్రశ్నించిన వేతనదారులపై సిబ్బంది వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ మేరకు సీతానగరం, పాచిపెంట తదితర మండలాల్లో వేతనదారులు ఆందోళనలకు కూడా దిగిన సంఘటనలు ఉన్నాయి. ఇదంతా జిల్లా ఉన్నతాధికారుల కనుసన్నల్లో జరుగుతున్నందన ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లాలో 1.68లక్షల మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో కోత విధించడంతో పాటు రెండు పూటలా పని చేయాలనే కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. దీంతో తీవ్ర ఎండల్లోనూ కూలీలు రెండుపూటలా పనిచేయాల్సి వస్తోంది. ఇదే అదునుగా ఉపాధి హామీ సిబ్బంది కూలీల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు. కూలీలను అన్ని దశల్లోనూ ఇబ్బందులు గురి చేస్తున్నారు. కూలీలకు కొత్తపని పుస్తకం పంపిణీ నుంచి పేమెంట్ వరకు అన్ని స్థాయిల్లో డబ్బులు చెల్లిస్తే తప్ప పనులు జరగని పరిస్థితి జిల్లాలో నెలకొంది. మస్తర్లు వేసే విషయంలో సిబ్బంది కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. డబ్బులు ముట్టచెబితే కనీస వేతనం, లేదంటే తక్కువ వేతనం వచ్చేలా చేస్తున్నారని కూలీలు ఆవేదన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పని పుస్తకం మొదలు పని కూలి వేతనం వరకు డబ్బులు ఇచ్చి పని చేయించుకోవాల్సి వస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉపాధి కూలీలు తమ సమస్యలను అధికారుల వద్ద ప్రస్తావించినా ఎటువంటి ఫలితం లేకపోగా ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపుగా పని డిమాండ్ పెట్టకపోవడం, తక్కువ కూలి వచ్చేలా మస్తర్లు వేయడం చేస్తున్నారని కూలీలు అంటున్నారు.

జిల్లాలో పలు చోట్ల కూలీలు వారంలో ఆరు రోజులు పని చేయగా పేమెంట్ వివరాల్లో మాత్రం కేవలం రెండు లేదా మూడు రోజులు పని చేసినట్లుగా చూపిస్తూ ఆయా రోజులకు సరిపడా వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఆరు రోజులు పని చేసినట్లుగా సంతకాలు చేసినప్పటికీ క్షేత్రస్థాయ సహాయకులు మాత్రం తమ మొబైల్ ఫోన్లలో రెండు, మూడురోజులకు డిజిటల్ మస్తర్‌లో హాజరు వేస్తున్నారన్నారు. ఉపాధి కూలీలు చాలామంది వరకు నిరక్షరాస్యులు ఉండడంతో తాము ఎన్ని రోజులు పని చేస్తున్నాం, ఎన్ని రోజులకు కూలి చెల్లిస్తున్నారో తెలియని పరిస్థితిలో కూలీలు ఉన్నారు. తాము సంతకాలు చేసిన పేపర్ మస్తర్లకు ఎటువంటి ప్రాముఖ్యత లేని పక్షంలో తమ వద్ద సంతకాలు తీసుకోవడం ఎందుకని కూలీలు ప్రశ్నిస్తున్నారు. కనీస కూలి డబ్బులు కూడా రావడం లేదని ఫీల్డు అసిస్టెంట్లను ప్రశ్నించగా కూలీలు చేసిన పనికి మాత్రమే వేతనం చెల్లిస్తున్నామని చెబుతున్నారు. ఆరు రోజులు పని చేస్తే రెండు, మూడు రోజుల చెల్లింపుల వివరాలు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారని ప్రశ్నించగా వారి నుంచి ఎటువంటి సమాధానమూ రావడం లేదు. పనుల పర్యవేక్షణలో భాగంగా పైస్థాయి అధికారులు పని ప్రదేశాల్లో సందర్శించినప్పటికీ కూలీలకు ఏమాత్రం ప్రయోజనం చేకూరడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పేపర్ మస్తర్లను, డిజిటల్ మస్తర్లను పరిశీలించాలని కూలీలు కోరుతున్నారు.

కనీస వేతనం రూ.256 చెల్లించాలి

ఉపాధి హామీ చట్టం నిర్దేశించిన ప్రకారం రోజుకు కనీస వేతనం రూ.256 చొప్పున చెల్లించాలి. వారంలో ఆరు రోజులు పని చేయగా రెండు లేదా మూడు రోజులు పని చేసినట్లుగా హాజరు ఎందుకు వేస్తున్నారో చెప్పాలి. కూలీలు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కూలీలకు వేసవి అలవెన్సులను పునరుద్ధరించాలి. ఒక్కపూట మాత్రమే పని చేయించాలి. ఇప్పటికైనా పై స్థాయి అధికారులు స్పందించి ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం అమలు చేయాలి.

కొల్లి గంగునాయుడు,
వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

ఉపాధి వేతనదారుల సమస్యలపై
15న కలెక్టరేట్ వద్ద ధర్నా

సీతానగరం : ఉపాధి కూలీలకు రెండు పూటలా పని నిలిపివేయాలని, వేసవి సందర్భంగా ఇచ్చిన మజ్జిగ అలవెన్స్, ఇతర సౌకర్యాలు కొనసాగించాలని ఈనెల15న పార్వతీపురం కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నా వేతనదారులంతా పాల్గొనాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమణమూర్తి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ధర్నాకు సంబంధించిన ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని లచ్చయ్యపేట చెరువు వద్ద వేతనదారులనుద్దేశించి మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోడీ ఉపాధి హామీకి తగ్గించిన బడ్జెట్లో రూ.30 వేల కోట్లు పెంచాలని, రెండు పూటలా పని నిలిపివేయాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని, టెంట్లు, మజ్జిగ, మంచినీరు సౌకర్యం కల్పించాలని, గతంలో ఇచ్చినట్లు గానే పనిముట్లు ఇవ్వాలని, పని ప్రదేశంలో కూలీలు మరణిస్తే రూ.10 లక్షలు నష్టపరిహారం ఇచ్చి, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని, కేరళలో వలె పాల రైతులకు ఉపాధి కోసం ఏడాదికి రూ. 40వేలు ఆవు, గేదే కొనుగోలుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ఈ చట్టం అమలుకు బడ్జెట్ పంపునకు కేంద్రంతో పోరాడాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుపర్చాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారానికై ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 15న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కూలీలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మామిడి రవి, కన్నయ్య సుందరమ్మ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అదాలత్‌లో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి దామోదరరావు

జాతీయ లోక్ అదాలత్‌లో
1674 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం ద్వారా కేసులు సత్వర పరిష్కారానికి ఇరుపక్షాల అంగీకారంతో 1674 కేసులు పరిష్కరించినట్లు రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. దామోదర రావు తెలిపారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ రాజీ మార్గం ఒక్కటే ఉందని, అందువల్ల కేసుల పరిష్కారం కోసం అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్న పాటి కేసులు సైతం రాజీ కావడం వల్ల కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బులు వృధా, వ్యయ ప్రయాసల నుంచి విముక్తి కలుగుతుందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహణలో భాగంగా శనివారం పార్వతీపురం మన్యం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో వాది, ప్రతివాదులతో చర్చలు జరిపి రాజీ చేసి 1674 కేసులు పరిష్కరించామని తెలిపారు. ఇందులో భాగంగా మోటార్ వాహనాల యాక్సిడెంట్ కేసులు 11, సివిల్ కేసులు 12, క్రిమినల్ కేసులు 1590 కేసులు పరిష్కరించామని, మోటారు యాక్సిడెంట్ కేసుల్లో అపరాధ రుసుము రూ.16లక్షలు, సివిల్ కేసుల్లో అపరాధ రుసుం రూ.25లక్షలు, క్రిమినల్ కేసులో అపరాధ రుసుం రూ.4లక్షలు వసూలు చేసినట్లు జిల్లా న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సౌజన్య, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కురుపాం : జాతీయ లోక్ అదాలతో ద్వారా 130 కేసులు పరిష్కారమైనట్లు కురుపాం జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య తెలిపారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ చిన్నపాటి కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా అవుతుందని, రాజీమార్గం అనేది లోక్ అదాలత్ ద్వారా జరుగుతుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు ఎం.వెంకటరమణ, గంటా రాజకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో బొబ్బిలిలోని పార్టీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యాన సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర బాగా పని చేసిందన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించడం వల్ల కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు ముగడ వెంకటరమణ, నాయకులు ఆర్.రామకృష్ణ, రాజాన అప్పలనాయుడు, పత్రి రాజు, శ్రీనివాస్, రామారావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో శృంగవరపుకోటలోని దేవి కూడలిలో ఆ పార్టీ మండల అధ్యక్షులు జి.బంగారు నాయుడు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. మిఠాయిలను తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి.మణిబాబు, ఎస్‌టి సెల్ జిల్లా చైర్మన్ చీమల అచ్చిబాబు, నియోజకవర్గ సమన్వయకర్త నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కాకముందే శిథిలం

- అధికారుల సమన్వయ లోపం... వంతెనకు శాపం
- వృథా అయిన రూ.8 లక్షలు
- ప్రజలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - వీరఘటం

రెండే రెండు శాఖల అధికారుల సమన్వయ లోపంతో ఈ వంతెనకు శాపంగా మారింది. స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని అచ్చపువలస గ్రామ సమీపంలో 2012లో అప్పటి కాంగ్రెస్ హయాంలో తోటపల్లి ప్రధాన ఎడమ కాలువపై రూ.8 లక్షల అంచనా వ్యయంతో వంతెన నిర్మాణ పనులతో పాటు రహదారి పనులు కూడా ఏర్పాటు చేశారు. రోడ్లు, భవనాల శాఖ, అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల వంతెన ప్రారంభం కాకముందే శిధిల వ్యవస్థకు చేరుకుంది .

ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజల సౌకర్యం కోసం ఆర్ అండ్ బి శాఖల ఆధ్వర్యంలో వంతెనతో పాటు రహదారి నిర్మించారు. దీనికి అటవీ శాఖ అధికారులు అడ్డు తగలడంతో పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అప్పట్లో ఈ వంతెన పనులు ప్రారంభం కావడంతో సుమారు 40 పైబడి గిరిజన గ్రామాలకు ప్రయాణం సాగించేందుకు ఎంతో సునాయాసంగా ఉంటుందని సంబరపడ్డ గిరి పుత్రుల ఆశలపై నీళ్ళు చల్లినట్లు అయింది. దీంతో గిరిజనులు వేరే మార్గం నుంచి ప్రయాణకుల రాకపోకలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరిన వంతెన

బ్రిజ్ భూషణ్‌ను బర్తరఫ్ చేయాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే భర్తరఫ్ చేసి రిమాండ్‌కు పంపించాలని ప్రజా సంఘాల నాయకులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలంటూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతుగా కొమరాడలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వేణు మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో నాలుగు సార్లు, కామన్వెల్త్, ఆసియాడ్‌లో అనేక పతకాలు సాధించి అంతర్జాతీయంగా భారత దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన మహిళా రెజ్లర్లు ఇప్పుడు ఆత్మగౌరవం కోసం రాజధాని నడిబొడ్డున ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు. తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత కుస్తీ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌పై ఒక మైనరుతో సహా ఏడుగురు మహిళా రెజ్లర్లు వారం రోజుల క్రితం ఫిర్యాదు చేస్తే, దీనిపై ఇంతవరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేయని ఢిల్లీ పోలీసుల నిర్లక్ష్యానికి కారణం ఏమని అనాలని అన్నారు. న్యాయం కోసం సుప్రీం కోర్టు తలుపుతట్టాల్సిన పరిస్థితికి బాధితులను నెట్టిన పాపం కేంద్ర ప్రభుత్వానిదేనని, దీనిపై సర్వోన్నత న్యాయస్థానం వెంటనే స్పందించి ఈ ఆరోపణలు తీవ్రమైనవంటూ విచారణ చేపట్టాలని నిర్ణయించిందని తెలిపారు. డబ్ల్యుఎఫ్ఐని తన జేబు సంస్థగా మార్చుకుని, పదేళ్లుగా ఆ పదవిలో తిష్టవేసుకు కూర్చొన్న బిజెపి ఎంపీ మహిళా రెజ్లర్లపై యథేచ్ఛగా లైంగిక వేధింపులు, క్రిమినల్ బెదిరింపులకు పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న సందర్భంగా వెంటనే అతడ్ని ఆ పదవి నుంచి తొలగించాలని, డబ్ల్యుఎఫ్ఐని సమూలంగా ప్రక్షాళన చేయాలని, ఆర్థిక అక్రమాలపై దర్యాప్తు జరిపించాలని మహిళా రెజ్లర్లు చేస్తున్న డిమాండ్లు అత్యంత న్యాయసమ్మతమైనవి అని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు భవిష్యత్తులో జరిగే పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కొల్లి సాంబమూర్తి, హెచ్.రామారావు, వెంకటేశు, రాము, రెడ్డి శివున్నాయుడు, ఎ.ఉపేంద్ర, సంగమ్మ, మాణిక్యం, దుర్గ, గంగమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

విజయనగరం టౌన్ : రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జెడ్‌పి మినిస్టీరియల్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం గర్వించదగినట్లు ఒలింపిక్స్‌లో ఎన్నో పథకాలు సాధించిన రెజ్లర్లపై బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక దాడులకు పాల్పడడం అత్యంత దుర్మార్గమైన చర్యని అన్నారు. అతనిపై చర్య తీసుకోవాలని 21 రోజులుగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. బ్రిజ్ భూషణ్ షన్ సింగ్‌పై పోక్సో కేసు చట్టం కింద కేసు పెట్టినప్పటికి కేవలం తన పార్టీ ఎంపి కావడంతో ప్రధానమంత్రి నోరు మెదపక పోవడం భాధాకరమైన విషయమన్నారు. ప్రపంచ ప్రఖ్యాతులుగా పేరు సంపాదించనున్న రెజ్లర్లకు అన్యాయం జరిగినప్పుడు స్పందించని బిజెపి ప్రభుత్వం సామాన్య మహిళలకు రక్షణ కల్పిస్తుందా అని ప్రశ్నించారు. ఎంపి పై చర్యలు తీసుకోవాలని పోరాడుతున్న రెజ్లర్లకు మద్దతుగా ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని ప్రజలను కోరారు. ఆందోళనలో భాగంగా ఈనెల 15న ఒక రోజు నిరసన దీక్ష, 18న ఆలిండియా పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్త నిరసన కార్యక్రమాలు, 20న 2కె రన్ కార్యక్రమాలు చేయా లని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి సన్యాసి నాయుడు, కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సతీష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వర్రావు, తిరుపతి నాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.రాంబాబు, సిఐటియు నగర కార్యదర్శి రమణ, ఐద్వా నాయకులు జగదాంబ, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్.పావని, గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శ్రీనివాసరావు , పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర్రావు, జెవివి నాయకులు నిర్మల, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాము,సహాయ కార్యద ర్శులు రవి, సౌమ్య, నాయకులు సోమేశ్, సమీరా, లావణ్య, కళ్యాణి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, సహాయ కార్యదర్శి నాయుడు, నాయకులు చంద్ర, ఈశ్వర్రావు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అటు ఏనుగుల సంరక్షణ, వాటి నుంచి ప్రజల ప్రాణాల రక్షణ విషయంలో పాలకుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. గడిచిన పదహారేళ్లలో 11ఏనుగులు, 18మంది మనుషులు, పదుల సంఖ్యలో పశువులు చనిపోవడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. అయినా పాలకులు చలించకపోవడం పట్ల జనం అసహ్యించుకుంటున్నారు. అసహనమూ వ్యక్తం చేస్తున్నారు. తాజాగా శుక్రవారం విద్యుదాఘాతంతో ఒకేసారి నాలుగు ఏనుగులు మృత్యువాతపడిన సంఘటన చర్చనీయాంశగా మారింది. ఇంత జరిగినా నేటికీ ఏనుగుల సమస్య రాజకీయ అజెండా కాలేకపోయింది. నవ్విపోదురుగాక నాకేంటి అన్న చందంగా వ్యవహరించడమే ఇందుకు కారణమని జనం చర్చించు కుంటున్నారు. వాస్తవానికి ఏనుగుల సమస్య ఈ నాటిది కాదు. 2007లోనే ఒడిశాలోని లకేరి అటవీ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపు అప్పటి ఉమ్మడి జిల్లా నేటి పార్వతీపురం జిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ శబ్ధకాలుష్యం ఎక్కువగా ఉండడంతో ఇటువైపు తరలి వచ్చినట్టుగా అప్పటి నుంచీ అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. నాగావళి నదితోపాటు మన్యం

పబ్లిక్ టాక్

జిల్లాలోని కురుపాం, జిఎల్‌పురం, జియ్యమ్మవలస, కొమరాడ, అటు భామిని, సీతంపేట, వీరఘట్టం తదితర మండలాల్లో తోటపల్లి, వట్టిగెడ్డ తదితర జలాశయాలు, ఏజెన్సీలు నిత్యం పారే సెలయేళ్లు ఉండడంతోపాటు చెరకు, అరటి, జీడితోపాటు వరి, మొక్కజొన్న వంటి పంటలు విరివిరిగా సాగవుతున్నాయి. ఇవన్నీ ఏనుగులకు అడ్డాగా మారాయి. పంటలు తినేయడం, ధ్వంసం చేయడం, నదులు, సెలయేళ్లలో నీరుతాగడం, దట్టమైన అటవీ ప్రాంతంలో సేదదీరడం అలవాటుగా మారింది. ఈ క్రమంలో ఇటు మనుషులు, అటు ఏనుగులు చనిపోతున్నా, పంట నష్టంతో రైతులు తీవ్రంగా నష్టపోయినా, మన్యం వాసులు భయం గుప్పెట్లో బతుకీడుస్తున్నా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకులకు 2010లో అప్పటి రాష్ట్ర అటవీశాఖ మంత్రి హయాంలో ఆపరేషన్ గజేంద్ర పేరిట ఏనుగుల తరలింపు కార్యక్రమం చేపట్టినప్పటికీ ఒక ఏనుగులు ఒడిశా వెళ్లాక చనిపోవడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో, ఆ కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఆ తరువాత స్థానికంగానే ఎలిఫేంట్ జోన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. దీంతో, ఏనుగుల గుంపు రాక ప్రారంభం నుంచి నేటి వరకు మొత్తం 18మంది ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది గాయపడ్డారు. రైతులు ఏటా పంటలు నష్టపోతునే ఉన్నారు. ఇటీవలే ఏనుగు దాడిలో ఓ ట్రాకర్ కూడా బలయ్యాడు. ఇటీవల ఏనుగులు ఏకంగా గ్రామాల్లోకి చొరబడి ఆరు బయట ఉన్న మంచాలు, పొయ్యిలు తదితరాలను ధ్వంసం చేస్తుండడంతో ప్రజల్లో భయాందోళన మరింత పెరిగింది. ఏనుగులను అటవీ ప్రాంతంలోకి తరలించి తమ ప్రాణాలకు భరోసా కల్పించాలని మన్యం వాసులు ఎన్నోసార్లు అటు అధికారులు, ఇటు పాలకులకు వినతులు అందజేశారు. అయినా చీమకుట్టినట్టు కూడా వ్యవహరించకపోవడంతో ఎప్పటి మాదిరిగానే సంచరిస్తున్న ఏనుగుల గుంపులోని నాలుగు ఏనుగులు భామిని మండలం కాత్రగడ్డ వద్ద విద్యుత్‌ఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాయి. దీంతో, ఈ పాలకులు అటు ఇటు మనుషులకు, అటు మృగాలకు రక్షణ కల్పించలేక పోయారనే చర్చ సర్వత్రా సాగుతోంది.

ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసిన పేదలు

ప్రభుత్వ స్థలంలో పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని బంగారమ్మ కాలనీలో సర్వే నెంబర్ 216-2లో ప్రభుత్వ భూమిలో కాలనీకి చెందిన నిరుపేద ఎరుకలి కులస్తులు శనివారం గుడిసెలు వేయడానికి ప్రయత్నించారు. వార్డు కౌన్సిలర్ పి.మధుసూధనరావు ఆధ్వర్యాన గిరిజనుల స్థలంలో గుడిసెలు వేయడానికి కర్రలు పాతారు. ఈ స్థలంలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ గతంలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ప్రయత్నించగా, పెద్దలు అడ్డుకున్నారు. పాకలు వేసుకుంటున్న పేదలకు ఎరుకలి సేవా సంఘం నాయకులు గేదెల లక్ష్మణరావు, దుర్గారావు మద్దతు పలికారు. ఇదిలా వుండగా ఈ స్థలంలో తమకు గతంలో తహశీల్దార్ ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని కొంతమంది నిర్మాణాలకు సిద్ధమవుతున్నారు.

వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

ఉపాధి పనుల పరిశీలన

సీతానగరం: మండలంలోని కోటసీతారాంపురంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం స్థానిక ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో మంచినీరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీలు సమయంలో వచ్చి పని చేసుకుంటే ప్రభుత్వ నిర్మించిన కూలీ గిట్టుబాటు అవుతుందన్నారు. ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ద్వారా పంపించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సీతంపేటలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఆరో రోజుకు వేసవి శిబిరం

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం శనివారానికి ఆరో రోజుకు చేరుతుంది. పిల్లలు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానపరమైన పరిజ్ఞానం పుస్తకాలు చదివారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలున్నాయని గ్రంథాలయ అధికారి గణేష్ బాబు తెలిపారు. గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన నిలయాలు అన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థినులు, సహాయకుడు రామకష్ణ పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆరవరోజు రోజు తంపటాపల్లి డ్రాయింగ్ మాష్టర్ గొర్లె మురళి పాల్గొన్నారు. మట్టితో వినాయకుని చిన్న విగ్రహం పిల్లలకు ఎలా తయారు చేయాలో వివరంగా చెప్పారు. విద్యార్థిని, విద్యార్థులు, ఇంచార్జి గ్రంథాలయ అధికారి గణేష్ బాబు పాల్గొన్నారు. ఆదివారం మాతత్వ దినోత్సవం సందర్భంగా డ్రాయింగ్ పోటీ పెట్టడం జరుగుతుందని, తల్లి ముఖ చిత్రం చూసి వేయడానికి చార్ట్ మరియు రంగులు ఎవరికి వారు తెచ్చుకోవాలన్నారు.

పరీక్షిత్‌రాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

పరీక్షిత్‌రాజుకు సన్మానం

వీరఘట్టం : మండలంలోని కొట్టుగుమ్మడలో శనివారం వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజును గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని పలు సమస్యలు పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉదయాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయ సబార్డినేటర్ మృతి

కురుపాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేటర్‌గా విధులు నిర్వహిస్తూ శోభలతాదేవి కాలనీలో నివాసముంటున్న వి.సత్యనారాయణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి తన సొంత ఊరైన బాడంగి మండలం పెంట భీమవరం గ్రామానికి వెళ్తుండగా తోటపల్లి గ్రామం వద్ద శనివారం మృతి చెందాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎంపిడిఒ వివి శివరామప్ప కార్యాలయ సిబ్బంది సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గతుకులమయమైన అడ్డంగూడకు వెళ్లే రోడ్డు

అడుగుకో గొయ్యి

గుమలక్ష్మీపురం : మండలంలోని చెముడుగూడ పంచాయతీ అడ్డంగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలతో గోతుల్లో నీరు నిండడంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ద్విచక్రవాహనాల తప్ప పెద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డు పనులు ప్రారంభించి రెండేళ్లు గడిచినా పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోతులు ఏర్పడ్డ రహదారిని మెరుగుపరిచి, వాహన రాకపోకలకు వీలు కల్పించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

మూలపడిన అంబులెన్స్

నిర్లక్ష్యం నిండుగా...

గుమ్మలక్ష్మీపురం : రోగులకు కొన్నాళ్ళపాటు సేవలు అందించిన అంబులెనులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా పాడై మూలకు చేరాయి. గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రం వెనుక భాగంలో గత పదేళ్లుగా ఇలా ఎండకు, వర్షానికి పూర్తిగా పాడైపోతున్నాయి. వేలం పాట వేసి అమ్మకానికి అధికారుల చర్యలు చేసుకోవడంలో శ్రద్ధ కనపర్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేలం ద్వారా అమ్మకాలు చేపడితే ప్రభుత్వానికి కొంత ఆదాయం వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఉన్నత విలువలు.. అత్యుత్తమ ఫలితాలు

విద్యార్థుల ప్రగతికి 'వేదాంత' పెద్దపీట

ప్రజాశక్తి- పార్వతీపురం

ఉన్నత విలువలతో కూడిన విద్యాబోధనలే అత్యుత్తమ ఫలితాలకు తమ కళాశాల విద్యార్థులు ప్రగతికి మెట్లుగా ముందడుగు వేస్తున్నారని స్థానిక వేదాంత కళాశాల చీఫ్ మెంటర్ పెంట అప్పారావు, ప్రిన్సిపల్ ఎస్ఎల్ నాయుడు అన్నారు. 2022-23 విద్యా సంవత్సరం ప్రథమ, ద్వితీయ ఇంటర్, జెఇఇ మెయిన్స్‌లో సాధించిన ఫలితాలు సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. మరిన్ని వివరాలు వారి మాటల్లోనే..

వేదాంత జూనియర్ కళాశాల ఇంటర్ విద్యతో పాటు ఐఐటి, జెఇఇ, నీట్, ఎంసెట్ ప్రోగ్రాంలతో ఆబ్జెక్టివ్ ఓరియెంటెడ్ బోధనలతో ప్రారంభించాం. 2022 ప్రారంభ ఏడాదిలోనే రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బిఆర్క్ ప్రవేశ పరీక్షలో మరిశర్ల సృజన స్టేట్ 3వ ర్యాంకు సాధించి ఆంధ్రా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ క్యాంపస్‌లో చోటు దక్కించుకుందన్నారు. తొలి ప్రయత్నంలోనే ఆల్ ఇండియా స్థాయిలో ఐఐటి - జెఇఇ మెయిన్స్‌లో మొదటి బ్యాచ్ విద్యార్థులు రేజేటి కల్యాణ్, కెవిపి ప్రతాప్‌రాజు, వరద గణేష్ యువన్, 96.66, 92.35, 93.80 పర్సంటేజీ సాధించి నిట్‌లో సీట్లు సాధించిన ఘనత తమ కళాశాల విద్యార్థులకు దక్కిందన్నారు. నీట్‌లో ర్యాంకు సాధించిన శ్రీహర శ్రీకాకుళం సాయి డెంటల్ కాలేజీలో సీట్ సాధించి ఉన్నత స్థాయికి ఎదగడం తమకు చాలా ఆనందదాయకమన్నారు. ఎపిపిసిఇఒ పరీక్షలో కె.సాహిల్ 3829 ర్యాంక్ సాధించాడు. అంతేకాక 10వేల లోపు ర్యాంకులు ఆరుగురు సాధించగా, 79 మంది విద్యార్థులు ఇంజనీరింగ్, 11 మంది విద్యార్థులు ఫార్మాసీ సీట్లు సాధించి ఉన్నత చదువులు చదువుతున్నారు. అదే ఏడాదిలో ద్వితీయ ఇంటర్ ఎంపిసి గ్రూపులో పాలక చాందిని 983 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో కలెక్టర్‌తో ప్రశంసలు అందుకుంది. తమ కళాశాలను సామాజిక స్ఫూర్తితో పేద, మధ్య తరగతి విద్యార్థుల భవితవ్యం బంగారు బాట కావాలని ఆశయంతో నడుపుతున్నాం. ఈ ఏడాది రెండో ఏట కూడా సీనియర్ ఇంటర్లో గెంబలి విజయగౌరి ఎంపిసిలో 985 మార్కులతో జిల్లా ప్రథమ స్థానం, జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 470 మార్కులకు గాను 463 మార్కులతో కె.సుహర్షిని రాష్ట్రస్థాయి ఐదో ర్యాంకు సాధించడమే కాకుండా బైపిసిలో డి.గౌతమి 440 మార్కులకు గానూ 423 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. వీటితో పాటు పార్వతీపురంలో ఉత్తీర్ణత శాతంలో తమ కళాశాల విద్యార్థులు ముందంజలో ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన జెఇఇ మెయిన్స్‌లో టి.సుజిత్‌కుమార్ 6927 ర్యాంకు సాధించి కళాశాల విజయ పతాకాన్ని మరో మారు ఎగరవేసిశారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలలోనూ, అటు ప్రతిభ పరీక్షలలోనూ మెరుగైన ఫలితాల స్థానాన్ని సుస్థిర పర్చుకున్నామన్నారు. చిత్రలేఖనంలో తమ కాలేజీకి చెందిన విద్యార్థి చక్రధర్‌చారి గీసిన చిత్రాలకు లయన్స్ ఇంటర్నేషనల్ ఫేస్ పోస్టర్ కంటెస్ట్‌గా వెళ్లి పలు బహుమతులను సాధించాడు.

బహుమతి పొందిన చిత్రం (ఇన్‌సెట్‌లో చిత్రకారుడుచక్రధర్‌చారి

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అభినందిస్తున్న కాలేజీ యాజమాన్యం, సిబ్బంది

డాక్టరై ప్రజాసేవ చేస్తా : శ్రీహర

వేదాంత జూనియర్ కళాశాల చీఫ్ మెంటర్ పెంట అప్పారావు, ప్రిన్సిపల్ ఎస్ ఎల్ నాయుడు ఐఐటి - ఫిజిక్స్, మ్యాథ్స్‌లో మంచి అనుభవం ఉన్నందున క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన వల్లే నీట్‌లో ర్యాంక్ సాధించి డెంటల్ కోర్సులో చేరాను. డాక్టర్‌గా ప్రజా సేవ చేస్తాను, వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఐఐటి సాధించడమే లక్ష్యం : సుజిత్ కుమార్

నేను ప్రభుత్వ హైస్కూల్లో చదువుకున్నాను. ఐఐటి సాధించాలనే లక్ష్యాన్ని అన్వేషించగా పార్వతీపురంలో తక్కువ ఫీజులతో కార్పొరేట్ తరహాలో 20ఏళ్ల అనుభవం గల అధ్యాపకులతో వేదాంత జూనియర్ కళాశాల నాకు మార్గదర్శిగా కనిపించింది. అందులో చేరి 2023 విద్యా సంవత్సరంలో జెఇఇ మెయిన్స్‌లో 6927 ర్యాంకు వచ్చినందుకు అధ్యాపకులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

చిన్నారుల ఆరోగ్యంపై పర్యవేక్షణ

ప్రజాశక్తి - బలిజిపేట

చిన్నారుల ఆరోగ్యంపై పర్యవేక్షణ అవసరమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని మురగడాంను శనివారం ఆయన సందర్శించి వైద్య సిబ్బంది నిర్వహించిన పిల్లల వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకా కార్డులో తేదీలను పరిశీలించి తదుపరి టీకా గడువు తేదీలను ఖచ్చితంగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవి రీత్యా టీకా బాక్స్‌లో శీతోష్ణస్థితి తగు విధంగా ఉండేలా జాగ్రత పడాలని, త్వరగా టీకా నిర్వహణ ప్రారంభించాలని సూచించారు. ఈ సందర్భంగా డిఐఒ చిన్నారికి టీకా వేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేసి, రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది, స్థానికులతో సమీక్ష జరిపి పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరమని హితవు పలికారు. ఆహార నియమాలు సక్రమంగా పాటించేలా చూడాలని, పిల్లలకు తరచుగా నీరు తాగించాలని, వైద్య సిబ్బంది సూచించిన కొన్ని అత్యవసర మందులు ఇంటి వద్ద ఉంచాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ఆర్.లక్ష్మణరావు, వైద్య సిబ్బంది సోనియా, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

వీరఘట్టం : మండల కేంద్రంలోని బిసి కాలనీలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ గర్భిణీలు, రక్తపోటు, జరపీడుతులకు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంత కుమారి, ఎంఎల్ హెచ్‌పి జ్ఞాన భార్గవి, టెక్నీషియన్ దినేష్, ఎఎన్ఎం ఉష, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

బిసిల ద్రోహి జగన్ : టిడిపి

బలిజిపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బిసిల ద్రోహి అని అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు బూరాడ రవికుమార్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పాలన వల్ల రాష్ట్రం నష్టపోయిందని, దగాకు, అణచివేతకు గురైందని అన్నారు. బిసిలకు ఎంతో మహోన్నత లక్ష్యం కలిగిన సబ్ ప్లాన్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, బిసిల కోసం ఖర్చు చేయాల్సిన రూ.78వేల కోట్లు దారి మళ్లించి ఆర్థికంగా బిసిలను అణగదొక్కారని విమర్శించారు. అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి మండల పెదపాపినాయుడు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కూడా రాజకీయంగా ఎదగాలనే లక్ష్యంతో ఎన్టీఆర్, చంద్రబాబు కల్పించిన 34 శాతం రిజర్వేషన్‌ను 24 శాతానికి కుదించారన్నారు. దీనివల్ల 16,800 మంది పదవులకు దూరమయ్యారని అన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురైన బీసీలు చదువుకోవాలని చంద్రబాబు ప్రోత్సహించే వారిని, నేడు అది లేదని అన్నారు. వేలాదిమందికి విదేశీ విద్య పథకం కింద రూ.10లక్షలు చొప్పున ఇచ్చి విదేశాల్లో చదివించని ఘనత టిడిపి ప్రభుత్వానిదేనన్నారు. బిసిలు గౌరవంగా వేడుకలు జరుపుకోవడానికి వీలుగా 13 బిసి భవనాలు, 1187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపడితే సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక వాటిని నిలిపివేశారన్నారు. నాలుగు ఏళ్లగా రాష్ట్రంలో రాక్షస పాలన జరుగుతుందని విమర్శించారు. అరకు పార్లమెంటరీ కార్యదర్శి వాసిరెడ్డి సత్యమనాయుడు మాట్లాడుతూ 650 మందిపై తప్పుడు కేసులు పెట్టి 2500 మందికి పైగా బీసీలపై దాడులు దౌర్జన్యాలు చేశారన్నారు. ఎంతోమంది టిడిపి బిసి నేతలపై అకారణంగా కేసులు పెట్టడమే కాక భయభ్రాంతులకు గురి చేశారన్నారు. బిసి మహిళ నేతలపై సోషల్ మీడియా వేదికగా వేధింపులకు దిగి, అవమానించారన్నారు. ఇలా చెప్పుకుంటే పోతే బిసిలకు జగన్ రెడ్డి చేసిన అన్యాయానికి అంతులేదని విమర్శించారు. అందుకే ఈనెల 18 నుంచి 22 వరకు జగన్ రెడ్డి అరాచకాలపై బీసీలను ఏకం చేస్తూ పోరుబాటుకు పిలుపునిచ్చామని, దీనికి బీసీలు సహకరించి విజయవంతం చేయాలని వారు కోరారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు కోచింగ్

కలెక్టరేట్ : పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి ఫెయిల్ విద్యార్థులకు జూన్‌లో జరగబోవు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వనున్నట్టు గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు స్థానిక ఐటిడిఎ పిఒ అనుమతితో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని రావికోన బాలురకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బాలికలకు కొత్తవలసలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వసతి, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే కోచింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, దీనికి సంబంధిత విద్యార్థులు, తలిదండ్రులు విషయం గమనించి ఈ అవకాశం సద్వినియోగించుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

వేతనదారులతో మాట్లాడుతున్న నాయకులు శ్రీనివాసరావు, ఈశ్వరరావు

వేతనదారులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధి హామీ పనులు సక్రమంగా అమలు చేయాలని, కూలీలకు వేతనాలు ఇవ్వడంలో పక్షపాత ధోరణిలు, వేధింపులకు గురిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ తవిటయ్య, ఎపిఒపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం, సిఐటియు జిల్లా నాయకులు మద్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం వేతనదారులతో వారు మాట్లాడారు. చట్టపరంగా గిట్టుబాటు కూలి ఇవ్వాలని అడిగిన వారిని లక్ష్యంగా చేసుకొని ఇబ్బందులు పెడుతున్నారని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు రూ.60 నుంచి రూ.70లోపే వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి జిల్లా అధికారులు మండలమంతా పర్యవేక్షిస్తే ఇటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఒకపక్క నిర్వీర్యం చేస్తుంటే, మరోవైపున అధికారులు కూలీల పట్ల తప్పుడు పద్ధతిలో వ్యవహరించి వేధింపులు గురి చేయడం సరికాదన్నారు. దీనిపై మండలంలోని సమగ్ర దర్యాప్తు చేసే కూలీలందరికీ న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని, కూలీలకు చట్టపరంగా డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వేధింపులు గురి చేస్తే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మండల కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్, ఎపిఒ వేధింపుల ధోరణి మానుకోకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నవధాన్యాల సాగు... నేలతల్లి బహుబాగు

ప్రజాశక్తి - కురుపాం

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి సారవంతమై నేలతల్లి బహు బాగుగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ యాంకర్ పర్సన్ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని రస్తా కుంటుబాయి, పొడి గ్రామాల్లో శనివారం రైతులకు తొలకరి వర్షాలకు ముందుగా పంపిణీ చేయడానికి పచ్చిరొట్ట జాతులు, పప్పు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, చిరు ధాన్యాలు, ఆకు కూరలు, కాయ కూర, మొదలగు 10 నుంచి 20 రకాలు విత్తనాలు కలిపి ఎకరాకు 10 కేజీలు చొప్పున ప్యాకింగ్ చేసిన కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవ ధాన్యాలను రైతులు తమ పొలాల్లో వేసుకోవడం వల్ల భూమి సారవంతంతో పాటు, పశువుల దాణాకు కూడా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రధాన పంటలకు అవసరమైన అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని, ఏ విధమైన రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదని, ఖర్చులు కూడా తగ్గుతాయని, ఆరోగ్యకరమైన ఆహార పంటలు పండించడం జరుగుతుందని, భూమిలో సేంద్రియ కర్బనశాతం పెరుగుతూ సకాలంలో వర్షాలు అనుకూలంగా పడతాయని అన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ ఎ.మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.తిరుపతిరావు, ఎస్.భాస్కర్ రావు, రైతులు పాల్గొన్నారు.

విత్తనాల సంచులను సిద్ధం చేసిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సిఎం హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

గత ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన కురుకుట్టిలో మండల నాయకులు శశికళ, శ్రీదేవితో కలిసి మాట్లాడారు. స్కీం వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని చెప్పారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

కుక్కల దాడిలో మృతి చెందిన మేకలు

కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతి

సీతానగరం: మండలంలోని చినబోగిలికి చెందిన జానా తవుడు ఇంటికి ఆనుకుని ఉన్న శాలలో కుక్కలు చేసిన దాడిలో పది గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిలినట్లు గొర్రెల కాపరి తవుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కుక్కల నియంత్ర లేకపోవడంతో గొర్రెలు, పశువులను గాయపరుస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి ఆర్థికంగా తనను ఆదుకోవాలని, కుక్కలను నియంత్రించాలని ఆయన కోరారు

తల్లి మందలించిందని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

తల్లి మందలించిందన్న మనస్థాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని చోటు చేసుకుంది. స్థానిక జిల్లా కేంద్రాసుపత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డోకిశిల పంచాయితీ, చల్లంవలసకు బొద్దల మాధురి స్నేహితులతో కూడి అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేస్తుంది. దీంతో ఆమె తల్లి శనివారం మందలించడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న మాత్రలను అధికసంఖ్యలో మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. స్పందించిన కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేశారన్న మనస్తాపంతో..

పార్వతీపురంరూరల్: తమ కుటుంబీకులు దాడి చేశారన్న మనస్థాపంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనకు శనివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉనానయి. సీతానగరం మండలం గెడ్డలుప్పికి చెందిన రొంపిల్లి గౌరీశ్వరికి తన తోడికోడలు కుటుంబంతో శనివారం గొడవ జరిగింది. దీంతో ఆమెపై తోడికోడలు సత్యవతితో పాటు ఆమె కుమారులు కలిసి దాడిచేశారు. అవమానంతో మనస్థాపం చెందిన గౌరీశ్వరి ఇంట్లో ఉన్న నెయిల్‌పాలిష్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్పందించిన భర్త జిల్లా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. వైద్యుల చికిత్స అందించారు. ఔట్‌పోస్టుపోలీసులు వివరాలు నమోదు చేశారు.

పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలపై విచారణ

వీరఘట్టం : మండలంలోని దశమంతపురం ప్రాథమిక పాఠశాలలో అశాంఘిక కార్యక్రమాలు శనివారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంగారాం లిఖిత పూర్వకమైన స్టేట్మెంట్‌ను రికార్డ్ చేసి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించినట్లు ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

15 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

బలిజిపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15 నుంచి ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపుల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియంలో అడ్మిషన్లు జరుగుతాయని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జ్యోతి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మొదటి విడత కింద ఈనెల 15 నుంచి కళాశాలలో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి ఆదేశాల మేరకు మొదటి విడత ఇంటర్ ప్రవేశాలు జరుగుతున్నట్లు ఆమె తెలిపారు. మండలంలో పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గజపతినగరం : రామభద్రపురం మండలం పాతరేగ గ్రామానికి చెందిన పెద్దింటి గణేష్ (25) శనివారం మండలంలోని మరుపల్లి వద్ద జాతీయ రహదారిపై అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. రోడ్డు ప్రమాదానికి గురైనట్లు భావించి గ్రామస్తులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బందికి అక్కడి చేరుకుని, విగతజీవిగా ఉండటంతో వెనుదిరిగారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. గణేష్ విజయనగరంలోని ప్రయివేటు బ్యాంకులో పనిచేస్తున్నాడు.

కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఉపాధ్యాయ బదిలీల కంటే ముందుగా ఎంఇఒ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ డిఇఒ పోస్టులకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశంలో దాదాపు రెండు దశాబ్దాలుగా పలు కోర్టు వివాదాలతో నిలిచిపోయిన ఎంఇఒ పోస్టులను, అలాగే గత ఏడాదిగా ఆగిన హై స్కూల్ హెచ్ఎంల ఉద్యోగోన్నతులను అమలు చేసేందుకు విద్యాశాఖ మంత్రి చొరవ తీసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. విద్యాశాఖలో మరింత మెరుగైన పర్యవేక్షణకు 679 ఎంఇఒ -2 పోస్టులను, 13 ఎంఇఒ-1 పోస్టును మంజూరు చేశారన్నారు. వీటితో పాటు ఇప్పటికే ఖాళీగా ఉన్న దాదాపు 270 ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ పోస్టులు 55 కలిపి దాదాపు వెయ్యి పోస్టులు పైగా పదోన్నతులను అమలు చేయాల్సి ఉందన్నారు. బదిలీల ముందే ఈ పోస్టులను భర్తీ చేస్తే కింద క్యాడర్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు, ఎస్జీటీలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కనుక జాప్యం లేకుండా కౌన్సెలింగ్ షెడ్యుల్ ప్రకటించాలని తమ లేఖలో మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు సామల పేర్కొన్నారు.